క్లుప్తంగా

శాకంబరిగా చాముండేశ్వరీదేవి

• తరలివచ్చిన భక్తులు



శాకంబరిగా అమ్మవారు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయాన్ని ఆపిల్, నారింజ, అరటి వంటి పండ్లతో పాటు, వంగ, బెండ, దొండ, క్యాప్సికమ్, ఉల్లిపాయలు, టమోటా తదితర కూరగాయలతో సుందరమనోహరంగా అలంకరించారు. ఉభయకర్తలుగా శ్రీరాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీస్(నెల్లూరు) అధినేత కొలపర్తి రమేష్, సువర్ణలత, కుమారుడు లిజిత్ కుమార్ వ్యవహరించారు. పండ్లు, కూరగాయల అలంకారణతో విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సిబ్బంది భక్తుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రాకతో ఆలయం కోలాహలంగా మారింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొడవలూరు : ముప్పై ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలిశారు. అమెరికా, శ్రీలంక వంటి దేశాల్లో స్థిరపడిన వారు సైతం చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు వచ్చారు. వారు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి చేష్టలు, గురువుల బెత్తం దెబ్బలను గుర్తు చేసుకుని ఆనందించారు. ఇందుకు మండలంలోని గండవరం వేదికైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. ముప్పై ఏళ్ల తరువాత స్నేహితులు కలవడంతో చిన్ననాటి సంగతులు, ప్రస్తుత విశేషాలను ఒకరికొకరు పంచుకొని ఎంతో ఆనందించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. నాటి గురువులను గుర్తు పెట్టుకుని విద్యార్థులు చూపిన మమకారానికి వారు పులకించిపోయారు. కార్యక్రమంలో నాటి గురువులు గున్నయ్య, రమణమూర్తి, చెంచురామయ్య, శాంతికుమార్, రమణయ్య, ప్రస్తుత హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఉన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాకాణి

పొదలకూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అంకమ్మతల్లికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్ ఆధ్వర్యంలో అంకమ్మతల్లి దేవస్థానంలో నిర్వహించిన విశేషపూజలకు కాకాణిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన పూజలు నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కాకాణి వెంట రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస దయకార్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, బిరదవోలు పంచాయతీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామాజిక సేవే లక్ష్యం



పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెంకటాచలం : సామాజిక సేవ చేయడమే లక్ష్యంగా నైనా ఫౌండేషన్ పనిచేస్తున్నట్లు హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ డైరెక్టర్ బి.డేవిడ్ దయాసాగర్ అన్నారు. వెంకటాచలంలోని చర్చిలో నైనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని పేదలకు తమ వంతు సేవ చేయాలనే ఆలోచనతో గత కొన్నేళ్ల నుంచి నైనా ఫౌండేషన్ పని చేస్తుండడం అభినందనీయమన్నారు. నైనా ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుహాసిని మాట్లాడుతూ కరోనా సమయంలో వెంకటాచలం మండలంతో పాటుగా, ఇతర గ్రామాల్లో ప్రజలకు వంట సరుకులు, దుస్తులు, ఆహార పదార్థాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు కండే వినయ్‌కుమార్, మెడికో సైమన్ సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన అధికార పార్టీ ఆగడాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని పరిశ్రమలపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలంలోని వాటర్‌బేస్ కంపెనీలో కాంట్రాక్ట్ కోసం.. వెంకటాచలం మండలం బీర్ ఫ్యాక్టరీలో క్యాంటీన్ నిర్వహణను తమకే ఇవ్వాలంటూ అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. రామాయపట్నం పోర్టులో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్ట్‌ను తమకు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు.

పలు పరిశ్రమల్లో స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై అధికార పార్టీ నేతలకు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ దాడులను ప్రభుత్వం అరికట్టాలని, లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని స్పష్టం చేశారు. నేతలు ప్రసాద్, గోగుల శ్రీనివాస్, పెంచలనరసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం

నెల్లూరు(బృందావనం): ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నెల్లూరు కార్యవర్గ సమావేశాన్ని ఆచారివీధిలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు హెడ్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ అనిల్‌బాబు మాట్లాడారు. సీనియర్ సిటిజన్లు తమ భవిష్యత్తు భద్రత కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవాలని కోరారు. ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం పోస్టాఫీస్ ద్వారా రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పోస్టల్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. జూలైలో జన్మించిన 27 మంది సీనియర్ సిటిజన్లు.. నూతన సభ్యత్వం పొందిన వారిని సత్కరించారు. తొలుత అనిల్‌బాబును సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కొండా ప్రణయ్‌శంకర్, పచ్చిపులుసు శ్రీరాములు, వాయుగుండ్ల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్‌మాస్టర్‌ను సన్మానిస్తున్న నేతలు

జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోరూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి నీరు చేరుతోందని, ఈ క్రమంలో పది టీఎంసీలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిల ప్రాజెక్టుకు విడుదల చేసి జిల్లా రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ నేతలు కోరారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ నేత చంద్రరాజగోపాల్ మాట్లాడారు. సోమశిలలో గతేడాది 60 టీఎంసీలు ఉంటే, ప్రస్తుతం అది పదికే పరిమితమైందని వివరించారు. నేతలు శ్రీరాములు, వెంగయ్య, వెంకమరాజు, పుల్లయ్య, బుజ్జయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ హెపటైటిస్ డేను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో హెపటైటిస్, లివర్ సంబంధిత అంశాలపై నారాయణ హాస్పిటల్ వైద్యుడు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కార్యదర్శి గుర్రం వెంకటసురేంద్రబాబు, మాజీ అధ్యక్షులు బాసం శేషగిరిరావు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని హైస్కూల్లో మెగా రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 216 మంది రక్తదానం చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు విజయ్, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌కు ఘన సన్మానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శతమానం భవతి కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం ఈ నెల్లో జన్మించిన 20 మంది వాకర్స్‌తో కేక్‌ను కట్ చేయించి సత్కరించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు నలబోలు బలరామనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, మహ్మద్, జయరామ్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణా వెంకయ్యకు సత్కారం

నెల్లూరు సిటీ: మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన స్వర్ణా వెంకయ్యను వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు ఏసునాయుడు, వెంకటరమణ, బల్లి వెంకయ్య, హరి, శ్రీధర్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

నెల్లూరు సిటీ: కేన్సర్ కారకాల్లో ఒకటైన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సింహపురి వైద్యశాల అధినేత డాక్టర్ దయాకర్‌రావు పేర్కొన్నారు. వేదాయపాళెంలోని చైతన్యపురి పార్కులో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధునిక జీవనంలో ఒత్తిడిని జయించే పద్ధతులు.. ఆహార అలవాట్లలో మార్పులు రావాలని సూచించారు. అనంతరం వస్త్ర సంచులను కార్పొరేటర్ అహల్య పంపిణీ చేశారు. పార్కు అసోసియేషన్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు, శ్రీరామ్మూర్తి, మస్తానయ్య, మహేష్‌నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వస్త్ర సంచుల పంపిణీ

సమస్యలపై అర్జీలను అందజేయండి

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను సోమవారం స్వీకరించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు అర్జీలను స్వీకరించనున్నామని ఆయన చెప్పారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుకను లోడ్ చేసే విషయంలో లారీలు, ట్రాక్టర్ల యజమానులకు ఆదివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ స్థానికులైన తమపై వివక్ష చూపుతూ బయట నుంచి వచ్చిన లారీలు, టిప్పర్లకు లోడ్ చేయడం సమంజసం కాదన్నారు. మొదట స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు



తోటపల్లిగూడూరు : మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జేసీబీలను ఉపయోగించి పలు టిప్పర్ల ద్వారా వెంకన్నపాళెం నుంచి సౌత్‌ఆములూరు గ్రామానికి అనధికారికంగా మట్టి తరలింపు కార్యక్రమాన్ని సాగించారు. వెంకన్నపాళెం నుంచి కొత్తపాళెం, పోట్లపూడి మీదుగా టిప్పర్లతో మట్టి తరలిస్తుండడంతో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు మట్టిని తరలిస్తుండడంతో పోలీసులు మిన్నకుండిపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకుని మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

సత్తాచాటిన గండవరం యోగా మాస్టర్



కొడవలూరు : సౌతిండియా యోగా చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని గండవరం ఆయుష్ యోగా మాస్టర్ జ్యోతి రాజేంద్రకుమార్ ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఇండియన్ యోగా అసోసియేషన్, తమిళనాడు స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ సంయుక్తంగా చెన్నై టీనగర్‌లో 12వ సౌతిండియా యోగా చాంపియన్ షిప్–24 పోటీలను ఆదివారం నిర్వహించారు. ఇందులో రాజేంద్రకుమార్ పాల్గొని మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. గండవరం ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.గీత, హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆటో బోల్తా

• ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని దామరమడుగు సమీపంలో ముంబై జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం వేగంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా బోల్తా పడింది. ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉండగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆటోను నిలిపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. ముంబై రోడ్డుపై నిత్యం వాహనాలు అతివేగంగా వెళ్తుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారతీయ క్రీడాకారులు ఎక్కువ పతకాలను సాధించాలని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ కాంక్షించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటో తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సింధు మొదటి జాతీయ స్థాయి పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆడిన సందర్భాన్ని గుర్తుచేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నెల్లూరు నుంచి బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, విజయ్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఆదిశైవ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం



నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో జిల్లా ఆదిశైవ బ్రాహ్మణ, అర్చక ఆత్మీయ సమావేశం, జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లాలో ఆదిశైవ బ్రాహ్మణ, అర్చకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ, అర్చక సంఘ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బ్రాహ్మణుల సంక్షేమానికి పథకాలను అమలు చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం

సంఘ జిల్లా అధ్యక్షుడిగా శేషగిరిరావు (కావలి), ప్రధాన కార్యదర్శిగా గుడ్లూరు ఫణికుమార్‌శర్మ (బుచ్చిరెడ్డిపాళెం), కోశాధికారిగా ముదివర్తి రవికాంత్‌శర్మ (చెన్నూరు), ఉపాధ్యక్షుడిగా పోగుల భార్గవ సాయిశర్మ (ఈపూరు), ఉప కార్యదర్శిగా గూడలి సుధీర్‌శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా మూలం రాజు భానుప్రకాష్ శర్మ (మల్లాం), కార్యవర్గ సభ్యులుగా నాగఫణిశర్మ, వెంకట్రామారావు, యువజన విభాగ కార్యదర్శిగా హరిహరనాథశర్మ, మహిళా విభాగ సభ్యులుగా గుడ్లూరు శ్రీదేవి, వెంకటసునీత, నూతలపాటి సుప్రజ ప్రమాణస్వీకారం చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి మురికిపూడి కృష్ణకిషోర్, రాష్ట్ర కార్యదర్శి నూతలపాటి సుబ్బయ్యశాస్త్రి, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కురిచేటి లక్ష్మీనారాయణ, ఏపీబీఎస్సెస్సెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, కార్యనిర్వాహ కార్యదర్శి కామేశ్వరప్రసాద్‌శర్మ, ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కోశాధికారి రామాయణం మణి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాల అందజేత

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దివ్యాంగ బాలికల వసతిగృహ విద్యార్థినులకు నోట్ పుస్తకాలను జెడ్పీ వాకర్స్ సంఘ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు హాజరయ్యారు. అసోసియేషన్ గౌరవ సలహాదారు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, ప్రసాద్, రాజగోపాల్, కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి చెంచయ్య, హరిసుధ, మేరీ బ్లెస్సింగ్టన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై గాయాలతో వృద్ధుడు

• ఆస్పత్రికి తరలించిన కానిస్టేబుల్

నెల్లూరు(క్రైమ్): ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద ఓ వృద్ధుడు గాయాలతో రెండు రోజులుగా అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. విషయాన్ని ఆదివారం గమనించిన నార్త్ ట్రాఫిక్ కానిస్టేబుల్ చెన్నయ్య వృద్ధుడ్ని లేపేందుకు విఫలయత్నం చేశారు. నీటితో మొహాన్ని కడిగారు. దుస్తులు మట్టి కొట్టుకొని ఉండటంతో వాటిని శుభ్రం చేశారు. కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండటంతో 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.



అంబులెన్స్ వద్దకు వృద్ధుడ్ని తీసుకెళ్తున్న కానిస్టేబుల్

ధూర్జటి కవితా మాధుర్యంపై ఉపన్యాసం

నెల్లూరు(బృందావనం): మహాకవి ధూర్జటి కవితా మాధుర్యానికి కారణం ఆయనకు ఈశ్వరుడిపై ఉన్న అచంచల భక్తి విశ్వాసాలే కారణమని వేద సంస్కృత కళాశాల విశ్రాంత తెలుగు రీడర్, ఉపన్యాసకురాలు డాక్టర్ కప్పర గిరిజాలక్ష్మి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ధూర్జటి కవితా మాధుర్యంపై ఆమె ఉపన్యసించారు. అనంతరం గిరిజాలక్ష్మిని సత్కరించారు. చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, సాహితీవేత్త కాళిదాసు పురుషోత్తం, నెల్లూరు వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ సమన్వయకర్త నలుబోలు బలరామయ్యనాయుడు, హరేంద్ర వరప్రసాద్, సుబ్బరాయుడు, దుర్భా మురళీకృష్ణ, శ్రీలక్ష్మి, బృందావనరావు తదితరులు పాల్గొన్నారు.



కోసూరు రత్నానికి అవార్డు

నెల్లూరు(బృందావనం): విశాలాక్షి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం సౌతిండియా ఎలైట్ బ్రాండ్ అవార్డును అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన తెలియజేశారు. హైదరాబాద్ బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో నిర్వహించిన గ్లోబల్ ఫినాలే ఫౌండేషన్ సౌతిండియా ఎలైట్ కార్యక్రమంలో అవార్డును బీజేపీ జాతీయ నేత కొంపెల్ల మాధవీలత అందజేశారని వివరించారు. నిర్వాహకులు అనూప్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఆండాళ్ అమ్మవారికి పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరువాడిపూర ఉత్సవాలను సోమవారం నుంచి ఆగస్ట్ 8 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను రోజూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.